క్లుప్తంగా

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ



కోనేరుసెంటర్: మంగినపూడిబీచ్‌లో శుక్రవారం జరిగిన కార్తికపౌర్ణమి పుణ్య స్నానాల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. దీంతో మంగినపూడిబీచ్‌లో స్నానాల ఘట్టం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసింది. బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసుల బందోబస్తును జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు పరిశీలించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ బందోబస్తును పరిశీలించి సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్తివెన్ను 33 కేవీ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. 10 గంటల తరువాత తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

నేడు మండలంలో..

కోడూరు: మండల వ్యాప్తంగా శనివారం విద్యుత్ కోతను విధించనున్నట్లు ఆ శాఖ ఈఈ డి.కృష్ణనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడూరు ఫీడర్ షెడ్యూల్ మెయింటెన్స్‌లో భాగంగా ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఘంటసాల: విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం మండలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఏఈ రవి కుమార్ శుక్రవారం తెలిపారు. ఏపీసీపీడీసీ ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణానాయక్ ఆదేశాల మేరకు మండలంలోని ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మంచి పుస్తకం మంచి నేస్తం లాంటిది



పెడన: ఒక మంచి పుస్తకం..మంచి నేస్తం లాంటిదని, పుస్తక పఠనం వల్ల ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పెడన శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వారోత్సవాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఆయన పుస్తక ప్రదర్శనను సందర్శించడానికి విచ్చేసిన విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తక పఠనం ఎంతో మంచిదని, దానిని అలవాటు చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పెడన శాఖ గ్రంథాలయాధికారి బసవేశ్వరరావు, పాఠకులు, విద్యార్థులు ఉన్నారు.

ఏడో రోజుకు చేరిన రైతుల దీక్షలు

బంటుమిల్లి: స్థానిక లక్ష్మీపురం సెంటర్లో దాళ్వా సాగునీటి కోసం జరుగుతున్న దీక్షలు శుక్రవారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల రైతులు వారం రోజులుగా సాగునీటి కోసం దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు ఆరోపించారు. ఒక పక్క సార్వా కోతలు ముమ్మరంగా జరుగుతుండగా పాలకులు, అధికారులు ఎటువంటి ప్రకటన చేయకుండా రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని భూముల స్థితిగతులు తెలిసికూడా అధికారులు ఉదాసీనవైఖరి అవలంభిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ దీక్షలు రైతు నాయకులు జి.నాగేశ్వరరావు, ఎస్.జనార్థన్‌రావు, కె.రాము, టి.లక్ష్మణ, ఎల్. అజయ్‌ఘోష్ తదితర రైతులు పాల్గొన్నారు.

తిరగబడిన ట్రాక్టరు ట్రక్కు

పెడన: పెడన – బంటుమిల్లి రోడ్డులోని శింగరాయపాలెం సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు ట్రక్కు తిరగబడింది. మొగల్తూరు నుంచి విజయవాడ వెళ్లేందుకు అయ్యప్ప భక్తులు ఐదుగురు బొలెరో వాహనంలో బయల్దేరారు. పెడన నుంచి బంటుమిల్లి వైపు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టరు డ్రైవర్ ఆటోను ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని రాసుకుంటూ పోవడంతో బొలెరో వాహనం డ్రైవర్ సీటు పక్క భాగం డ్యామేజ్ అయింది. ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి, సంఘటనపై ఆరా తీసి వివరాలను నమోదు చేసుకున్నారు.

బుసక కనిపించిందా అంతే..!





పల్లోటి లే అవుట్ దాటిన తరువాత పంట చేనులో వేసిన మట్టిని తవ్వేసిన వైనం : పల్లోటి హైస్కూలు పక్క రోడ్డులో మట్టిని తవ్వేందుకు సిద్ధంగా పొక్లెయిన్

- అక్రమంగా బుసక తరలింపు
- మెరక పనులకు బుసక ఉపయోగం
- అధికారుల అనుమతి లేకుండా తవ్వకాలు

పెడన: ఇసుకాసురులకు పోటీగా బుసకాసురులు పోటీ పడుతున్నారు. అధికారుల అనుమతులు లేకుండా బుసకను బొక్కేస్తున్నారు. ఇష్టారాజ్యంగా బుసక భూములను తవ్వుతూ అక్రమ వ్యాపారం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

దూరాన్ని బట్టి రేటు..

మండలంలో బుసక రేటు సపరేటు. ట్రాక్టరు బుసక రూ.1600 పైమాటే. దూరాన్ని బట్టి రేటు పెరుగుతూ ఉంటుంది. కొత్తగా నిర్మించే ఇళ్లకు, భవనాలకు, రోడ్లుకు ఈ బుసక మెరక చేయడానికి ఎంతో ఉపయోగం. దీంతో అందరి కళ్లు ఈ బుసకపైనే ఉంటాయి. బుసక గట్లు ఎక్కడ కనిపించినా దానిని తవ్వేసి ఎత్తుకుపోవడం జరుగుతుంది.

ఇష్టానుసారంగా..

మండలంలో బుసకాసురులు తమ ఇష్టానుసారంగా తవ్వుకుపోతూ ఆ బుసకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో తవ్వేసిన మట్టిని డొంక రోడ్డు మార్జిన్ల వెంబడి నిల్వ ఉంచి రేటు వచ్చినప్పుడు మట్టిని తరలిస్తున్నారు. పల్లోటి హైస్కూలు పక్క రోడ్డులోను, పల్లోటి లే ఆవుట్ దాటిన తరువాత పంటబోదె పక్క పంట పొలంలో మట్టి తోలకం పనులు నిరాటంకంగా జరుగుతున్నాయి. ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. సొంత పొలం తవ్వేస్తున్నా ముందుగా రెవెన్యూ వారికి రాతపూర్వకంగా తెలియజేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా మట్టిని తవ్వేస్తున్నారు.

సిబ్బందిని పంపించాం..

మట్టి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఇన్‌చార్జి విజయలక్ష్మీతో పాటు పలువురు సిబ్బందిని స్పాట్‌కు పంపించాం. అయితే అక్కడ ఎటువంటి వాహనాలు లేవు, ఎవరూ అక్కడ లేరు. అయినా ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టి మట్టి తరలిపోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

పేదలకు సహాయం అభినందనీయం

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

మచిలీపట్నంటౌన్: పేదలకు సహాయం చేస్తున్న సామాజిక సేవా సంస్థల కృషి అభినందనీయమని జిల్లా న్యాయసేవా సాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. నగరంలోని గుప్తా సెంటర్లో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూ.15 భోజన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికి 1600 కార్యక్రమాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరాశ్రయులు, నిరు పేదలకు ఈ క్యాంటిన్ ఎంతగానో ఉపయోగపడటం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ద్వారా గత 8 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తుండటం హర్షణీయమన్నారు. జడ్జి రామకృష్ణయ్య కేక్ కట్ చేశారు. పేదలకు భోజనాన్ని వడ్డించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఉస్మాన్‌బాషా, బడుగు ఉమాదేవి, వెంకటేశ్వరమ్మ, శ్యామల, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



పేదలకు భోజనం వడ్డిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

త్రయంబకేశ్వరుని సేవలో పేర్ని నాని దంపతులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా మహారాష్ట్రలోని జ్యోతిర్లింగమైన త్రయంబకేశ్వరుణ్ణి దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు మేలులు జరిగేలా చూడాలని వారు స్వామి వారిని వేడుకున్నారు.



త్రయంబకేశ్వరుని ఆలయం వద్ద పేర్ని నాని, జయసుధ దంపతులు



కృత్తివెన్ను శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హంసలదీవి సాగరతీరంలో పర్యాటకుల కోలాహలం



నాగాయలంక కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు, రక్షణగా బోట్లలో గజ ఈతగాళ్లు


భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు

మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో కార్తిక పౌర్ణమి పూజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తిక మాసంలో మహాశివునికి అత్యంత ప్రీతికరమైన రోజు కార్తిక పౌర్ణమి. అటువంటి కార్తిక పౌర్ణమి కావడంతో శుక్రవారం వేకువ జామునే భక్తులు పెద్ద ఎత్తున శైవక్షేత్రాలకు వెళ్లి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు చేయించారు. కార్తిక దీపాలు వెలిగించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. మంగినపూడి, హంసలదీవి బీచ్‌లను భక్తులు సందర్శించి పుణ్యస్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున సైకత శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. నియోజకవర్గాల పరిధిలోని ఆలయాల్లో జ్వాలా తోరణాలను దాటారు. ప్రసిద్ధి చెందిన మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో స్వామివార్లను ఆలయ ప్రదక్షిణ చేశారు. ఎండుగడ్డిని తోరణాలుగా అలంకరించి, కాగడాలతో వెలిగించారు. భక్తులు హరహరా అంటూ పెదపెట్టున నినాదాలు చేస్తూ తోరణాలను దాటి వెళ్లారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

–మచిలీపట్నం టౌన్/కోనేరు సెంటర్/మోపిదేవి/నాగాయలంక/ఘంటసాల/పెడన/అవనిగడ్డ/కోడూరు/బంటుమిల్లి/కృత్తివెన్ను/గూడూరు



నాగాయలంక నది ఒడ్డున కార్తిక వత్తులు వెలిగించి పూజ చేస్తున్న మహిళలు



నాగాయలంకలో వివిధ రకాల పండ్ల అలంకరణలో శ్రీరామపాదక్షేత్రం రామలింగేశ్వరుడు



నాగాయలంక కన్యకాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పెదతుమ్మిడి శివాలయంలో జ్వాలాతోరణంలో భక్తులు



పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మోపిదేవిలో జ్వాలా తోరణం దాటుతున్న స్వామివారి పల్లకి

ముగిసిన ఐఓటీ వర్క్ షాప్



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అనిత టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులైన మణికంఠ టీమ్ సభ్యులతో మూడు రోజులపాటు జరిగిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వర్క్ షాప్ శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయ్‌కుమారి వర్క్ షాప్‌నకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం సమన్వయ కర్త శేఖర్ బాబు, వర్క్ షాప్ సమన్వయకర్త వెంకట కృష్ణ, ఎలక్ట్రానిక్స్ విభాగ బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి పేషెంట్ బెడ్ వితరణ

ఘంటసాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఘంటసాల పీఏసీఎస్ చైర్‌పర్సన్ దివంగత దోనేపూడి వీర రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం కుమారుడు వెంకట రామకృష్ణ చౌదరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉపయోగపడే విధంగా రూ.30 వేల విలువైన పేషెంట్ బెడ్‌ను శుక్రవారం డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ సమక్షంలో అందించారు. పీహెచ్‌సీకి బెడ్ వితరణగా ఇచ్చిన దాతలకు డాక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, గొర్రెపాటి జగన్‌మోహనరావు, గొర్రెపాటి మధుసూదనరావు, పిడిగే రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక క్వారీలో పని కల్పించాలని వినతి

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రభుత్వం అనుమతిచ్చిన ఇసుక క్వారీలో ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ మండలంలోని తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన ఎస్సీలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముఠా కూలీలు మాట్లాడుతూ మండలంలోని శ్రీకాకుళం గ్రామ పరిధిలోని కృష్ణానదిలో ఉచిత ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే శ్రీకాకుళం రెవెన్యూ పరిధిలోని తెలుగురావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 50 మంది కూలీలు ఇసుక క్వారీలో పని చేసుకునేందుకు కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి స్టాక్ పాయింట్‌కు తరలించాల్సి ఉంది. శ్రీకాకుళం గ్రామానికి చెందిన వారికి మాత్రమే పనులు కల్పిస్తామని, తెలుగురావుపాలెం వారికి అవకాశం ఇవ్వమనటంతో ముఠా కార్మికులు ఇసుక క్వారీలో ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే వాహనాలను అడ్డుకుంటామని చెప్పారు. జిల్లా కలెక్టర్‌కు అర్జీ కూడా ఇచ్చామన్నారు. స్పందించి జీవనోపాధి కల్పించాలని కోరారు. పెదముత్తేవి వసంతరావు, చాట్రగడ్డ చిన్నీ, తలకటూరి ఏసుదాసు, బుర్రే నాగమల్లేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న తెలుగురావుపాలెం ఎస్సీ కాలనీ ముఠా కార్మికులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామానికి చెందిన యద్దనపూడి కృష్ణారావు (74) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు సమాచారం మేరకు ఈ నెల 10వ తేదీన అర్తమూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణారావు తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయములో మరణించాడు. భార్య వై.నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన మేకా గీతాసంపూర్ణ (22) విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఎస్ఐ గణేష్‌కుమార్ సమాచారం మేరకు గుడ్లవల్లేరు మండలం, డొకిపర్రు గ్రామానికి చెందిన గీతసంపూర్ణకు పెదతుమ్మిడి గ్రామానికి చెందిన మేకా వెంకటేశ్వరరావు కుమారుడు నరేష్‌తో 5 సంవత్సరాల కిందట వివాహమైంది. అప్పటి నుంచి భర్త, అత్తమామలు అధిక కట్నకానుల కోసం వేధిస్తుండటంతో బాధలు భరించలేక ఈ నెల 13వ తేదీ రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను మచిలీపట్నం ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి కాగిత గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి వ్యాను బోల్తా

మండల పరిధిలోని ముంజులూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై మహేంద్ర వ్యాన్ శుక్రవారం అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికుల సమాచారం మేరకు విజయవాడకు చెందిన పండ్ల వ్యాపారులు వ్యాన్ ద్వారా పలు ప్రాంతాలకు పండ్లు సరఫరా చేస్తారు. ఈ క్రమంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గ్రామంలో పండ్లు సరఫరా చేసి తిరిగి వస్తుండగా ముంజులూరు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రెండోవైపునకు వెళ్లి రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డట్టు తెలిసింది. డ్రైవరు ప్రాణాలతో బయటపడ్డాడు.



ముంజులూరు రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టిన వ్యాన్

'నియోజకవర్గంలో టీడీపీకి దిక్కు లేకుండా పోయింది'

అవనిగడ్డ: మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు, ఇన్‌చార్జి లేకపోవడం వల్ల టీడీపీ దిక్కులేనిదయిందని టీడీపీ కోడూరు మండల కన్వీనర్ బండే శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా రాగా ఆయన ముందే టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండే శ్రీనివాసరావు మాట్లాడుతూ బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వొద్దని చెప్పిన వారే ఇప్పుడు ఆయన వెనకాల ఉంటున్నారని, మాలాంటి వాళ్లు అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు కూటమిగా ఉంటుందో లేదో తెలియదని, ఇలాగే వదిలేస్తే విడిగా పోటీ చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి కొల్లూరి వెంకటేశ్వరరావు బండే శ్రీనివాసరావుని వారించే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. సభ్యత్వాలు చేర్పించేందుకు వెళితే ముందు కోడూరు– అవనిగడ్డ రోడ్డు పూర్తిచేసి రావాలని కొంతమంది ముఖంమీదే చెప్పేస్తున్నారని, కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఎందుకు రోడ్డుని వేయలేదని కోడూరు మండలానికి చెందిన మరో నాయకుడు నిలదీశారు. ఇలా ప్రతి ఒక్కరూ నిలదీయడంతో నియోజకవర్గ పరిశీలకుడు ఏమీ చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

రెండో రోజు గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన



మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎండీ హాజీబేగ్, చిత్రంలో నగేష్



ఘంటసాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంపీపీ రజనీ కుమారి



గూడూరులో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు

మచిలీపట్నంటౌన్/ఘంటసాల/గూడూరు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం పాఠకులను అమితంగా ఆకట్టుకుంది. ఈ పుస్తక ప్రదర్శనను జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు ఎండీ హాజీబేగ్ ప్రారంభించారు. విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పర్యావరణం, జాతీయ నాయకుల అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించగా సిబ్బంది పాల్గొన్నారు. పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లోని మండలాల పరిదిలో గ్రంథాలయాల్లో రెండో రోజు వారోత్సవాలను నిర్వహించారు.

సర్వే తీరు పరిశీలన

పెడన: డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్(డీబీటీ)కి సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సర్వే, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే నిర్వహణ తీరును మున్సిపల్ మేనేజర్ ఎంఆర్‌వీఆర్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. మూడు, నాలుగు సచివాలయాల్లో ఆయా సర్వేలు ఎంత వరకు చేసింది, లక్ష్యానికి చేరుకున్నదీ లేనిదీ పరిశీలించారు. సర్వే వెనుకబడటంతో త్వరితగతిన సర్వే చేయాలని ఆదేశించారు. వీరితో పాటు ప్లానింగ్ సీనియర్ పి.జితేంద్ర తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితోనే దేశవ్యాప్త గుర్తింపు

చల్లపల్లి(అవనిగడ్డ): సమష్టి కృషితోనే వక్కలగడ్డ పీఏసీఎస్‌కు దేశవ్యాప్త గుర్తింపు లభించిందని జిల్లా సహకార సంఘ అధికారి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. చల్లపల్లి మండల పరిధిలో వక్కలగడ్డ సొసైటీ ఆవరణలో శుక్రవారం సహకార వారోత్సవ కార్యక్రమం జరిగింది. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 213 సహకార సంఘాలు ఉండగా వక్కలగడ్డ సంఘం ప్రత్యేక స్థానం పొందిందన్నారు. విభాగ సహకార అధికారి వివి ఫణికుమార్, సబ్‌డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి డి నాగమల్లేశ్వరరావు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ వై.నాగరాజకుమారి, జోనల్ ఎడ్యుకేషనల్ అధికారి కె.భోజరంగరాజు, సహకార సంఘాల సీఈవోలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో శ్రీసువర్చలాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులకు ద్వాదశ ప్రదక్షిణాలు, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వార్షిక పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా పండితులు పరాశరం రంగనాథాచార్యులు, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఉత్సవమూర్తులను ఒంటివాహనంపై ఉంచి 12 రకాల కళలతో ప్రదర్శనలు చేస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు ఆలపించిన ఊయల పాటలతో ఊంజలసేవ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com